దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 9 : ప్రజా సమస్యలకు ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి 52 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అధికారులు ఎవరు నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఫిర్యాదులు ఇవ్వడానికి వస్తుంటారని వారి ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే ఫిర్యాదుదారులకు అధికారులు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో అదనపుకలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణాలు పూర్తిచేయాలి

జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళాశక్తి భవనాలు నవంబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి బడిబాట, ఇందిరామహిళాశక్తి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ చాలాజిల్లాల్లో ఇందిరామహిళా శక్తి భవన నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనులు వేగవంతం చేసి నిర్ధేశిత గడువులో పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పాఠశాల విద్యార్థుల కోసం 52వేల ఏకరూప దుస్తులు అవసరం కాగా ఇప్పటివరకు 42వేల దుస్తులను కుట్టి సిద్ధం చేయడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపుకలెక్టర్ నర్సింగరావు, సంక్షేమశాఖ అధికారి సునంద సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

25వ తేదీలోగా గుర్తింపు కార్డులు

ఈ నెల 25 వతేదీ లోపు బూత్‌స్థాయి అధికారులకు గుర్తింపుకార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1200 ఓట్లకు పైగా ఓటర్లు ఉన్న చోట కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇది వరకు 1500 వరకు ఓట్లు ఉంటే ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని ప్రస్తుతం 1200 లోపు ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా గుర్తించిన పోలింగ్‌కేంద్రాలతో కూడిన ప్రతిపాదనల జాబితాను ఈ నెల 20వ తేదీలోపు పంపించాలని కలెక్టర్లకు ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం పండగలా జరపాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, జూన్ 9 : జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం పండగ వాతావరణంలో జరిగేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం, మహిళా సాధికారతపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా సాధికారత, పాఠశాలల్లో విద్యార్థులనమోదు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు, మౌలిక సదుపాయాలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతిమహిళను మహిళా సంఘంలో పేరు నమోదు చేయించాలని తద్వారా వారు అధికవడ్డీకి డబ్బులు తీసుకొని ఆర్థికంగా నష్టపోకుండా చూడవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా చూడాలని ఆదేశించారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో బడిబాట కార్యక్రమం కొనసాగుతుందని , గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని 31,254 మంది విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులు మహిళ సంఘాల టైలర్‌ల ద్వారా కట్టించే కార్యక్రమం పూర్తయింది ఇప్పటికే 10వేల దుస్తులు పాఠశాలలకు పంపించారన్నారు. మిగిలిన దుస్తులు 11వతేదీలోపు అన్ని పాఠశాలలకు పంపించి 12వ తేదీన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఒక జత ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఏకరూప దుస్తులు కొట్టినందుకు మహిళా టైలర్లకు రూ.57.64 లక్షలు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ ఇంచార్జ్ యాదయ్య, పీడీ డీఆర్‌డీవో ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఈవో కార్యాలయం నుంచి అసిస్టెంట్ కమిషన్ ఆఫ్ జనరల్ ఎగ్జామ్స్ గణేశ్, సీ ఎంవో యుగంధర్, డీపీఎం అరుణ పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

21లక్షల మొక్కలు నాటాలి

ఈ సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లాలో 21లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి వెల్లడించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో జిల్లా అధికారులు, మండల అధికారులతో వన మహోత్సవం కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది జిల్లాలో 21లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు గ్రామాలు, మండలం, మున్సిపాలిటీ సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ప్రధాన రహదారుల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ గొప్పగా జరగాలని, రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ చొప్పున పెద్దమొక్కలు నాటాలని, తద్వారా గ్రామానికి కళ వస్తుందని సూచించారు. ప్రస్తుతం ఉన్న స్థితి ఫొటోలు తీసుకోవాలని, మొక్కలునాటిన తర్వాత నెలరోజులకు తిరిగి ఫొటోలు తీసి అందజేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వైకుంఠధామాలు, సిగ్రిగేషన్ షెడ్లు వంటి వాటికి మొక్కలతో బౌండ్రీలు వేయాలని సూచించారు. ఇరిగేషన్ కాల్వల పైభాగంలో ఖాళీస్థలాల్లో ఈత, తాటి వంటి మొక్కలు విస్తృతంగా నాటాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో స్థలం గుర్తించి వాటిని జియో ట్యాగింగ్ చేసి టీజీఎ ఫ్‌ఎంఎస్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. తద్వారాసైట్‌కు దగ్గరలో ఉన్న నర్సరీని మ్యాచింగ్ చేసేందుకు సులభంగా ఉంటుందన్నారు. కోతులు అడవిని వదిలి పట్టణాల్లోకి వస్తున్నాయని వాటికి ఆహారం దొరికేవిధంగా అటవీ ప్రాంతంలో పండ్లమొక్కలు విరివిగా పెంచాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికి లక్ష్యంగా మేరకు మొక్కలు నాటేకార్యక్రమం పూర్తి చేయాలని అప్పుడే నాటిన మొక్కలు బ్రతికి ఉండే అవకాశం ఉందన్నారు. ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వన మహోత్సవం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి 5పండ్ల మొక్కలు ఇచ్చే విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 63ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమావేశంలో జిల్లాఅటవీశాఖ అధికారి ఇంచార్జి సత్యనారాయణ, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, ఆర్డీవో సుబ్రమణ్యం, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూన్ 9 : 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఆంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాములు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివేందుకు విద్యార్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారశాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల, కళాశాలను మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 9618243794 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. విద్యార్థులు 6-14 సంవత్సరాలు కలిగిన వారు 40 శాతం అంధత్వ సర్టిఫికెట్ కలిగి ఉన్న వారు అర్హులని ఆయన తెలిపారు.

క్రీడాపాఠశాలకు విద్యార్థుల ఎంపిక

వనపర్తి టౌన్, జూన్ 9 : క్రీడాపాఠశాలల్లో ప్రవేశాలకోసం విద్యార్థుల ఎంపిక ఉంటుందని జిల్లా క్రీడల శాఖ అధికారి సుధీర్‌రెడ్డి తెలిపారు. 4వతరగతి నుంచి ప్రవేశాలు ఉంటాయని జూన్16 నుంచి 19వరకు మండలస్థాయిలో, జిల్లాస్థాయిలో జూన్ 23 నుంచి 26 వరకు , రాష్ట్రస్థాయిలో జులై 1 నుంచి 5 వరకు ఎంపిక జరుగుతుందని చెప్పారు. హకీంపేట, కరీంనగర్ ,అదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో మొత్తం 120 సీట్లు అందులో బాలికలకు 60, బాలురకు 60 చొప్పున సీట్లు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. 30 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, 800 మీటర్ల పరుగుపందెం, బాల్‌త్రో, షటిల్‌రన్, ఎత్తు, బరువు తదితర పరీక్షలు ఉంటాయని, మొత్తం 9 విభాగాల్లో 27 మార్కులకు భౌతికపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు జనవరి 1, 2016 నుంచి ఆగస్టు 30, 2017 మధ్య జన్మించిన వారు అర్హులని, 8-9 వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. జూన్ 7 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియల ప్రారంభమవుతుందని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

గోపాల్‌పేట, జూన్ 9 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం వనపర్తి సీఐ కృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సెంట్రల్ లాకింగ్‌సిస్టం, సీసీటీవీలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్‌కుమార్ పోలీసుసిబ్బంది ఉన్నారు.

అధికలోడ్ వాహనాలు పట్టివేత

గద్వాల అర్బన్, జూన్ 9 : ఇసుక అధికలోడ్‌తో వెళ్తున్న వాతహనాలు పట్టుకొని ఆర్డీవో అధికారులకు అప్పగించినట్లు సీఐ టంగుటూరి శ్రీను పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో సీఐ మాట్లాడుతూ.. అదివారం సాయంత్రం కొన్ని ఇసుక టిప్పర్‌లు వెళ్తున్న క్రమంలో వాటిని పట్టుకొని తనిఖీ చేయగా అన్ని పేపర్‌లు సక్రమంగా ఉండడంతో వాహనాలను వేబ్రిడ్జి కాంటా వేసి పరిశీలించారు. ఈ క్రమంలో టిప్పర్ వాహనంలో పరిమితికి మించి లోడ్ ఉండడంతో వాహనాలను సీజ్ చేసి ఆర్డీవో అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కల్యాణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ టంగుటూరి శ్రీను పేర్కొన్నారు. సోమవారం పెద్దధన్వాడ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు మరికొందరు వెళ్తున్న విషయం తెలుసుకొని జిల్లాకేంద్రంలోనే వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కల్యాణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

గోపాల్‌పేట, జూన్ 9 : మండలంలోని చాకల్‌పల్లి గ్రామానికి చెందిన వజ్రారెడ్డి తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ అనే సాంకేతిక పరిజ్ఞానంతో ట్రేస్ఔట్ చేసి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని, సోమవారం ఎస్సై నరేశ్‌కుమార్ చేతుల మీదుగా పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు.

పిల్లల చదువులతో తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు

ఐఐటీలో సీటు సాధించిన సంపత్‌కుమార్ సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత, జూన్ 9 : పిల్లలు ఉన్నత చదువుల్లో రాణించినప్పుడే తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు వస్తాయని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అమరచింత పట్టణ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి చిన్న బాల్‌లత దంపతుల కుమారుడు సంపత్‌కుమార్ జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 412ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటు సాధించడంతో మాజీఎమ్మెల్యే పూలమాలతో సన్మానించారు. అలాగే పదో తరగతి ఫలితాలలో 600మార్కులకు 555 మార్కులను సాధించిన వారి చిన్న కుమార్తె సమతను కూడా చిట్టెం పూలమాల శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు గౌడ్, నాగభూషణం గౌడ్, నరేశ్‌రెడ్డి, రాజేందర్‌సింగ్, రియాజ్‌అలీ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు మొండిచేయి

షేక్ జహంగీర్

వనపర్తి టౌన్, జూన్ 9 : రాష్ట్రంలో మైనార్టీలను అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయకంగా ఎదగకుండా బొంద పెడుతుదని ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్ కోసం మాత్రమే వాడుకుటుందని బీఆర్‌ఎస్ మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ షేక్ జహంగీర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన హామీ డిక్లరేషన్‌లో అనేక అంశాలు పొందుపరిచి అమలు చేస్తామని ఇచ్చినహామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 14శాతం జనాభా కలిగిన ముస్లింలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానంలేదని , అదేవిధంగా శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు కూడా మైనార్టీ వర్గానికి చెందిన నాయకులు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. గతంలో 10సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించచారని గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పండ్లతోటల అధికలాభాలు

అమరచింత, జూన్ 9 : భూముల్లో పంట మార్పిడిలతో పండ్ల తోటలను సాగు చేసి అధికదిగుబడులతో పాటు లాభాలను ఆర్జించవచ్చని మదనాపురం కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద, చంద్రనాయక్‌తండాలో పంటమార్పిడులపై వివరించారు. కార్యక్రమంలో కేవీకే సైంటిస్ట్ సురేశ్, రమ్య మండల అధికారి అరవింద్ పాల్గొన్నారు.

పంట మార్పిడీతో ప్రయోజనాలు

వడ్డేపల్లి, జూన్ 9 : పంట మార్పిడి చేయడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త శ్రీధర్ అన్నారు. సోమవారం కొంకలలో పంటమార్పిడితో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఈశ్వర్‌రెడ్డి మండల వ్యవసాయాధికారి రాధ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

అలంపూర్, జూన్ 9 : ఆలయాల పరిసరాల్లో చేపట్టబోతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ధర్మకర్తల సాధారణ సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని, గోషాల నిర్వహణ ఇబ్బందిగా మారుతుండటంతో కొన్ని గోవులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో నాగశోమణి, జగదీశ్వర్ గౌడ్, విశ్వనాథరెడ్డి ఈవోపురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, జూన్ 9 : ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యను వ్యాపారంగా మార్చుకొని ప్రభుత్వ అనుమతుల్లేకుండా ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది అయిజ పట్టణంలోనే ఐదు ప్రైవేటు పాఠశాలలు వెలిశాయన్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో తల్లిదండ్రులు మోసపోకుండా గుర్తింపు పత్రాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు. అలాగే కొన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని, గుర్తింపు లేక పోయినా ఉన్నత తరగతులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, క్రాంతి, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

పురోహితుడికి ఘన నివాళి

వనపర్తి టౌన్, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని 33వ వార్డుకు చెందిన పురోహితులు వరదాచార్యులు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం మృతుడి ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, శేఖర్‌నాయక్, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, ఆరీఫ్, స్టార్ రహీం, ఏకే పాషా, వాజీద్, చిట్యాలరాము, యుగంధర్‌రెడ్డి, గోపాల్‌నాయక్, నీలస్వామి, గొంది రేణుబాబు, దండు శ్రీను, యాది ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి

రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గద్వాల టౌన్, జూన్ 9 : బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేశ్ అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రైల్వేస్టేషన్‌లో మాతాశిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఐఎస్ఐ సయ్యద్ అబ్దుల్లా, సిబ్బంది మోహిన్‌పాషా, చైల్డ్ లైన్ సిబ్బంది నవీన్, లక్ష్మి, ఆర్డీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసుల ఆశాజ్యోతి బిర్సా

వనపర్తి టౌన్, జూన్ 9 : ఆదివాసుల ఆశాజ్యోతి బిర్సా ముండా మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్రచైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల బిర్సా ముండా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

వనపర్తి టౌన్, జూన్ 9 : ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు వెంకటేశ్, కుతుబ్, రాఘవేంద్రలు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో వేలకు వేలు ఫీజుల దోపిడీ చేస్తున్నారన్నారు. విద్యార్థులకు 25శాతం ఉచితవిద్యను అందించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 9 : ప్రీ-రివిజన్ యాక్టివిటీస్‌లో భాగంగా 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో రేషనలైజేషన్ బీఎల్‌వోల నియామకం, గుర్తింపు కార్డు జారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లు అంతకంటే ఎక్కువ ఉన్నారో అలాంటి పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేసే పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి కొత్త పోలింగ్‌కేంద్రాలను సూచించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ లెవెల్ ఆఫీసర్ తప్పకుండా ఉండేవిధంగా నియామకం చేసుకోవాలని, బూత్‌లెవెల్ ఆఫీసర్ సంబంధిత పోలింగ్‌కేంద్రం పరిధిలో లేదా నజరీ నక్ష పరిధిలో నివాసం అయి ఉండాలని సూచించారు. ఈ ప్రక్రియ జూన్ 20 లోపు పూర్తి కావాలని సూచించారు. ప్రతి బీఎల్‌వోకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని, జూన్ 25 లోపు కొత్తగా నియామకం అయిన బీఎల్‌వోతో సహా అందరికి గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ చేసి అందజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలున్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు ఉన్నట్లు తెలిపారు. 1200 ఓటర్లు దాటిన పోలింగ్‌కేంద్రాలు వనపర్తి నియోజకవర్గంలో 38ఉన్నట్లు గుర్తించడం జరిగిందని త్వరలోనే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యం, డీ సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, డీటీ నాగేందర్ పాల్గొన్నారు.

రైతులను పరామర్శించడానికి వెళ్తే కేసులేనా..

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అరెస్టు

గద్వాల అర్బన్, జూన్ 9 : ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడిన రైతుల కుటుంబాలపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. వారి కుటుంబాలను పరామర్శిచడానికి వెళ్తే కేసులు నమోదు చేస్తారా అంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం జిల్లాకేంద్రంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు పూర్తి చేసుకొని పెద్ద ధన్వాడ గ్రామాన్ని సందర్శించడానికి వెళ్లేందుకు ప్రయత్నం చేయగా.. విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా కేంద్రంలోనే జాన్‌వెస్లీని అదుపులోకి తీసుకుని అక్రమంగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అఖిలపక్ష సంఘం నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే యాజమాన్యంపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, శ్రీరాంనాయక్, వెంకటస్వామి, ఆంజనేయులు, రెహమాన్, నర్సింహ ఉన్నారు.

రైతులకు అండగా ఉంటే అరెస్టులు చేస్తారా?

రాజోళి, జూన్ 9 : ఇథనాల్ కంపెనీని అడ్డుకుంటున్న పెద్ద ధన్వాడ రైతులను, వారికి అండగా నిలబడిన సీపీఎం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని పార్టీ మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సర్కారు తీరును నిరసిస్తూ రాజోళిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, నడిపెన్న, రవి, మహేశ్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భారత్‌పై అమెరికా పెత్తనం చేస్తుంది

గద్వాల టౌన్, జూన్ 9 : భారత్‌పై అమెరికా పెత్తనం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతదేశ విదేశాంగ విధానంపై అమెరికా పెత్తనిఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీరామ్‌నాయక్, వెంకటస్వామి, దేవదాస్, పరంజ్యోతి, వీవీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

మల్దకల్, జూన్ 9 : రైతుల భూ సమస్యలు ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించడానికే భూ భారతి చట్టంను తెచ్చిందని అధికారులు తెలిపారు. సోమవారం నేతువానిపల్లిలో సదస్సు నిర్వహించారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అలంపూర్, జూన్ 9 : భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ మంజుల అన్నారు. ఊట్కూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 31 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తాసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

కొంకలలో..

వడ్డేపల్లి, జూన్ 9 : రైతులు భూసమస్యలను పరిష్కరించుకోవాలని సోమవారం కొంకలలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. 13మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వీరభద్రప్ప, డిప్యూటీ తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కొంకల గ్రామంలో సమస్యలను తెలుపుతున్న రైతులు

యాపదిన్నెలో రెవెన్యూ సదస్సు

అయిజ రూరల్, జూన్ 9 : మండలంలోని యాపదిన్నెలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు డిప్యూటీ తాసీల్దార్ ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన బోయ పుల్లమ్మ దివ్యాంగురాలు సమస్యల వివరించారు. ఈ సందర్భంగాడిప్యూటీ తాసీల్దార్ ప్రశాంత్‌గౌడ్‌కు దరఖాస్తును అందజేశారు.

కొనసాగుతున్న బడిబాట

మల్దకల్, జూన్ 9 : మండల కేంద్రంతో పాటు పెద్దొడ్డి గ్రామాల్లో సోమవారం ఎంఈవో సురేశ్ ఆధ్వర్యంలో బడిబాట ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శుభ, వరలక్ష్మి, జాకీర్‌హుస్సేన్, నాగేశ్వర్‌రావు, ప్రదీప్, లోకేశ్వరి, మంజుల ఉన్నారు.

ఉత్సాహంగా బడిబాట

వనపర్తి టౌన్, జూన్ 9 : జిల్లా కేంద్రంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటింటా తిరిగి మెరుగైన విద్యను అందిస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేశ్, రాజశేఖర్, దక్షిణ మూర్తి, అమీర్, నాగరాజు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

అయిజ, జూన్ 9 : ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో సోమవారం ఎంఈవో రాములు ఆదేశాల మేరకు ఎమ్మార్సీ సిబ్బంది హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎంలు భద్రయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

పాన్‌గల్, జూన్ 9: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలకేంద్రంతోపాటు కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, అన్నారం, రేమద్దుల, శాగాపూర్ గ్రామస్తులతో కలిసి ఉపాధ్యాయులు గ్రామసభలు నిర్వహించారు.

సర్కారు బడుల్లో చేర్పించాలి

అయిజ, జూన్ 9 : సర్కారు బడుల్లోనే బడీడు పిల్లలను చేర్పించాలని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం నల్లయ్య తల్లిదండ్రులను కోరారు. సోమవారం మండలంలోని ఉప్పలక్యాంప్ గ్రామంలో బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సర్వేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పేరు మార్పు

★ పి.జానకి, D/o. పి.బుచ్చారెడ్డి అనే నేను తెలియజేయునది ఏమనగా, నా వివాహానంతరం నా పేరు గోపద్దిన్నె వనిత, W/o. జి.వేణుగోపాల్‌రెడ్డిగా మార్చబడినది. నా ప్రస్తుత నివాసం: డోర్ నెం. 19-41, బస్టాండ్ వెనుక, పెబ్బేర్ మండలం, పెబ్బేర్, వనపర్తి జిల్లా, తెలంగాణ-509 104.
NT-336390

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748